# మచ్చలేని మనసు

ఇంటి నుంచి అర ఫర్లాంగ్ దూరం నడిచిందాకావుండి ఆమె కాలి చెప్పు తెగిపోయింది. అది పాతదేమీ కాదు. మళ్లీ సాయంత్రం ఆలయానికెలాగా వెళ్లాలి. అప్పుడయితే సందు చివర గొడుగేసుకుని బూట్ పాలీషూ చెప్పులు రిపేరు చేసే అతనుంటాడు. అతని చేతికిస్తే నిమిషంలో బాగు చేస్తాడన్న ఆలోచన రాగానే తన చెప్పుల జతని ఓ చేత్తోనూ, నిత్యం ప్రసాదంతో బాటు పళ్లో, కూరగాయలో దార్లో కొని తేవడానికి కూడా తీసుకెళ్లే సంచీ ఓ చేత్తోనూ పట్టుకుని వెనక్కి తిరిగింది.

★ ★ ★

"శామల హియర్...."

"......."

"హాయ్ మధూ! గుడ్ మార్నింగ్. ఏమిటి విశేషం ఇంత పొద్దున్నే ఫోన్ చేశావు?"

"......."

"ఇవ్వాళ ఆదివారం కదా, ఇంకాస్సేపు పడుకోవచ్చుని. మా అమ్మ ఆలయానికి బయల్దేరితే తలుపేసి, వెళ్లి నడుంవాల్చికళ్లు మూసేనో లేదో ట్రింగ్ ట్రింగ్‌మంటూ నీ ఫోన్ కాలొచ్చింది."

"......."

"పిల్లలిద్దరూ నా దగ్గిరే పడుకున్నారు. ఇంకా లేవలేదు. లేపమంటావా? నీ దగ్గిర్నుంచి ఫోనొచ్చిందంటే లేచి ఎగిరి గెంతుకుంటూ వొస్తారు. చందూ మంచి ఉషారుగా నువ్వెప్పుడొస్తావా అని ఎదురుచూస్తున్నాడు. నిన్ననే వాళ్ల ప్రోగ్రెస్ రిపోర్టులొచ్చేయి. వాడు సిక్స్త్ రేంక్ నుంచి ఏక్‌దం ఫోర్త్ రేంకుకి జంప్ చేసాడు. ఉండు వాడిని లేపుకొస్తాను... సరేలే లేపను. ఎల్లుండి కాన్ఫరెన్స్ అయిపోతుంది కనక ఈవినింగ్ ఫ్లయిట్‌లో బయల్దేరొచ్చేయి. నువ్వు కేంప్ కెళ్లేవంటే మనిషివి కాదు. ఫ్రెండ్స్ బలవంతం చేశారంటావు, మీ బాస్ వుండిపొమ్మనానడంటావు– ఇలా ఏదో వంకని ఇల్లు మరిచిపోతావు."

"......."

" నీ ఫోన్ కాలొచ్చే ముందే బయల్దేరి వెళ్లింది. గుడి నించి తిరిగొచ్చేటప్పుడు కూరగాయలో, పళ్లో ఏవోకొని పట్టుకొస్తుంది. మంచివి చవగ్గా దొరికేయంటుంది. వొద్దమ్మా నౌకరున్నాడు పనిమనుషుంది, నువ్వెందుకు తెస్తావంటే వినిపించుకోదు. ఆవిడకదో సరదా, సంతృప్తి."

"......."

"వి. యస్ గాడ్గిల్ అంటే నువ్వు వెనక రిజైన్ చేసిన కంపనీలో బాస్ కదా?"

"......."

"ఇప్పుడు మీ కంపెనీలో వైస్ ప్రసిడెంట్‌గా తీసుకుంటున్నారా? అయితే కంగ్రాట్స్. ఇంక నువ్వు మరింత స్వేచ్ఛగా తిరగొచ్చు."

"......."

"రహస్యమైనా కాకపోయినా నేనవరితో చెబుతాను!"

"......."

"వొచ్చీ శనివారం ఆదివారమూనా! వెల్‌కం. నేను శనివారం శలవు పెట్టేస్తను. వియ్ విల్ గివ్ దెం కంపెనీ."

"......."

"హోటలెందుకు? వాళ్లని మనింటికే తీసుకురా. మిసెస్ గాడ్గిల్ నాకేమీ కొత్తకాదు సరదాగా ఉంటుంది.

"......."

"మన గెస్టరూంలో వుంటారు. వాళ్లున్న రెండు రోజులూ మా అమ్మ మన పిల్లలగదిలో వాళ్లతోనే ఉంటుంది."

"......."

"వాళ్లెంత ఆల్ట్రా మోడర్న్ స్టయిల్ ఆఫ్ లివింగ్‌కి అలవాటు పడినా వాళ్లు అవసరాలకీ, అభిరుచులకీ కావల్సిన సదుపాయాలన్నీ మనింట్లో ఉన్నాయి. వాళ్లు హోటల్లో వుండటం కంటే మనింట్లోనే వుండటం వాళ్లకీ సుఖం, మనకీ సుఖం. టైం కల్సొస్తుంది."

"......."

"వాళ్లబ్బాయి వొస్తేరానీ పదేళ్ల పిల్లాడంటున్నావు కదా! ఇంకో మంచం తెప్పించి గెస్టరూంలో వేయిస్తాను, లేదా సరదాగా మన పిల్లల దగ్గిరే పడుకుంటానంటే వాళ్ల

గదిలోనే వేయిస్తాను. పైగా మంచి ఫర్నిచర్, డ్రేపరీ, క్రోకరీ, కట్లరీ అన్నీ వున్నాయి. అసలు ఏమిటి తటపటాయిస్తున్నావు?"

"......."

"మా అమ్మ ఏమీ అనుకోదు. నలుగురు ఫ్రెండ్స్‌ని పిలిచి పేకాటన్నా, కాక్‌టెయిల్సన్నా ఏమీ యిబ్బంది లేదు. మా నాన్న వున్న రోజుల్లో ఎన్నోసార్లు అలాంటి పార్టీలు పెట్టుకుంటే, వెనకనుంచి ఏర్పాట్లన్నీ మా అమ్మ అజమాయిషీలోనే జరిగేవి."

"......."

"మా అమ్మని మా చిన్నన్నయ్యింటికి పంపడమెందుకు! నాకు సాయం చేస్తుంది. గర్ల్స్ పోలీటెక్నిక్ ప్రిన్సిపాల్ నా కొలీగ్. ఫోన్ చేసి కేటరింగ్‌లో ట్రెయినింగయిన ఓ అమ్మాయిని పంపమంటాను. ఏ లోటూ రాకుండా నేను చూసుకుంటాను. మహానుభావా!"

"......."

"ఏమిటో నసుగుతున్నావు! నా కర్థమయ్యేలా చెప్పు. మా అమ్మ మనింట్లో ఎందుకా? ఇంకెక్కడుంటుంది? నేను లేనప్పుడు మా చిన్నన్నయ్యేమైనా ఫోన్ చేశాడా మా అమ్మని పంపమని. వాడు పంపమన్నా నేను పంపను. వాడి భార్య వనజకి బంధుప్రీతి అంతంత మాత్రం. ఆస్తి పాస్తుల పంపకాల్లో మనపట్ల పక్షపాతం చూపిందన్న అక్కసుతో మా అమ్మని ఎంత గౌరవంగా చూసిందో నాకు తెలుసు. రెండు రోజులు కాదు కదా రెండు గంటలు కూడా అక్కడుండదు."

"......."

"అవును. ఆవిడ జీవితాంతం మనింట్లోనే వుంటుంది. అసలు మా పెద్దన్నయ్య పోయేక స్టేట్స్‌లో వున్న కొడుకు దగ్గిరకి మా వొదిన వెళ్లిపోగానే, తల్లి మీదున్న ప్రేమతో మా చిన్నన్నయ్య తీసుకెళ్లేడు. అక్కడున్న నెల్లాళ్లూ ముళ్ల మీదున్నట్టుందిట. ఇక్కడకొచ్చిన ఈ పదిహేను రోజుల్నుంచీ హాయిగా ఊపిరి పీల్చుకుంటుంది. మన పిల్లలిద్దరూ కూడా ఆవిడ దగ్గిర బాగా చనువయ్యేరు. నిత్యం రాత్రిళ్లు రామాయణం, భారతం, భాగవతం లోంచి ఏవో కథలు చెప్పందే ఆవిడకి నిద్ర పట్టదు. వినందే వీళ్లకీ పట్టదు. దగ్గిర్లోనే రామాలయం ఉంది. ఉదయం వెళ్లి దర్శనం చేసుకుంటుంది. సాయంత్రం అక్కడ ఏవో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఉపన్యాసాలు.."

"......."

"నాది ఉపన్యాసం కాదు. ఉన్నమాట చెప్పేను. మా అమ్మ యిక్కడ వుండటం ఆవిడకీ మనకీ కూడా సంతోషదాయకం అని వివరించేను."

"......."

నీకు సంతోషంగా లేదూ! అంటే మా అమ్మ మనింట్లో వుండటం నీకిష్టం లేదా! ఈజిట్ వాట్ యు మీన్!"

"......."

"ఎంచేత?"

"......."

"పొద్దున్నే ఆవిడ మొహం చూడలేకపోతే ఆవిడ పాదాలకేసి చూసి దణ్ణంపెట్టుకో."

"......."

"పిచ్చి పిచ్చిగా వాగుతున్నది నేను కాదు. నువ్వు. చూస్తున్నానుగా నీకు ధనమదం పెరిగింది. నీది నిర్మలమైన ప్రేమన్న భ్రమలో కొన్నాళ్లూ, వివాహ బంధం మీద గౌరవంతో మరికొన్నాళ్లూ, పిల్లల ఎదురుకుండా నీతో పేచీపెట్టుకుంటే మన యింటి పరువు వీధిన పడుతుందన్న భయంతో యిన్నాళ్లూ నీ ప్రవర్తనలో వొస్తున్న మార్పుని గమనిస్తూ కూడా సహిస్తూ వొస్తున్నాను. నీ ధోరణ శృతి మించింది. అసలు మనమీనాడు ఈ స్థితిలో వుండటానికి మా అమ్మే కారణం అని మరిచిపోయేవు. ఆనాడు మనం కులాంతర వివాహం చేసుకున్నప్పుడు మీవాళ్లు నిన్ను మీ యింట్లోంచి బయటికి గెంటేస్తే ఆదరించి ఆశ్రయమిచ్చి ఆస్తిపాస్తులిచ్చి ఆదుకున్నది మా అమ్మ. అలాంటి..."

"......."

"నాన్‌సెన్స్. అవన్నీ జ్ఞాపకముంటే అలా అనగలవా! ఈ వయస్సులో ఈ దుస్థితిలో చేరదీసి, ఓదార్చి గౌరవించి రుణం తీర్చుకునే అవకాశం దొరికినందుకు సంతోషించడం పోయి, ఆవిడ మన యింట్లోనే వుండకూడదంటావా! అదేం రోగం!"

"......."

"అది రోగంకాదు. ఆవిడ వొంటి మీద వొచ్చిన బొల్లి మచ్చలు. మనం స్కిన్ స్పెషలిస్ట్‌తో డిస్కస్ చేశాం. అది కేవలం చర్మం పొరలో పిగ్మెంట్ లోపించడం వల్ల అలా ఏర్పడుతుందనీ, అది అంటువ్యాధి కాదనీ, ఆడవాళ్లకి మేనోపాజ్ తర్వాత శరీరతత్వాన్ని పట్టి జరుగుతుందనీ...."

"......."

"అవిడ్ని చూస్తే నీకు కడుపులో దేవినట్టుంటే, సైంటిఫిక్‌గా ఆలోచించుకుని సమాధానపడటం నేర్చుకో. ఆవిడ చేత్తో పిల్లలకి అన్నం కలిపి పెడితే ఆవిడ అంత రంగ తరంగాల ప్రభావంతో అది వాళ్లకి అమృతమవుతుంది. వాళ్లు నీ పిల్లలే కాదు నా పిల్లలలూనూ. వాళ్ల ఆరోగ్యం ఎలా చూసుకోవాలో నాకూ తెలుసు. అది రోగం కాదని నీకు బాగా తెలుసునని నాకూ తెలుసు."

"......."

"అదృష్టం బాగాలేకపోతే ఆమె రక్తం పంచుకున్న నాకూ రావొచ్చు. నా రక్తం పంచుకున్న నా పిల్లలకీ రావొచ్చు. నీకైనా రావొచ్చు. ఎన్నో పార్టీలలో ఇటువంటి మచ్చలున్నవాళ్లని మనం చూస్తున్నాం. వాళ్లని ఆప్యాయంగా షేక్ హ్యాండివ్వటానికి కౌగిలించుకోడానికీ ఏ నాగరికుడూ సంకోచించడు. అలాంటివాళ్లు పెళ్లిళ్లు చేసుకుని పిల్లా పాపాతో హాయిగా వున్నవాళ్లెంత మందో వున్నారు."

"......."

"ఈవిడ నా కన్నతల్లి. చూడలేకుండా వున్నానని నువ్వు సులభంగా అనగలిగేవు. ఆమె నీ తల్లి కాదు కనక."

"......."

"నువ్వు మాట్లాడుతున్నదే నాన్సెన్స్. చూడ్డానికి బాగాలేదు. తీసి బయటపారేద్దామనడానికిదేమీ పాత కుర్చీ కాదు."

"......."

"భర్త యిష్టాయిష్టాల ప్రశ్న కాదు. స్త్రీ వాదంకాదు. ఇది మానవతావాదం."

"......."

"ముమ్మాటికీ ఇది అమానుషత్వమే. మన పిల్లలకి లేని భయం నీకెలా వొచ్చింది! పదిహేను రోజులయింది మా అమ్మ వొచ్చి. నాతో ఎప్పుడూ నువ్వీమాట అనలేదు. మా నాన్న పోయిన తర్వాత మా పెద్దన్నయ్యింట్లో ఆవిడ ఆరేళ్లుంది. వాళ్లెకెన్నడూ ఆవిడని గురించి ఏ సంకోచం పెట్టుకోలేదు. ఆవిడ ఎన్నో శుభకార్యాలకెళ్లింది. జాలిపడి ఆమె పట్ల మరింత ఆప్యాయత, గౌరవం చూపెట్టేం కాని...."

"......."

"అలా వాదించి తప్పించుకోలేవు. నీ ఆంతర్యం యిప్పుడు నాకుబాగా అర్థమైంది. నువ్వు గాద్గిల్‌దంపతుల్ని మనింటికి ఆహ్వానించాలనుకున్న సందర్భంలో మా అమ్మ

వాళ్ల కళ్లబడటం నీకు చిన్నతనం అనిపించింది. నీ నడిమంత్రపు సిరి తాలూకు సౌందర్యోపాసనకు ఆమె అవరోధం అయింది. ఈ సమయంలో ఆవిడ యింట్లో వుండదని తెలిసి, నాతో ఎదురుగా వాదించే ధైర్యం లేక ఫోన్‌లో దబాయిస్తే..."

"......."

"ఇది నా ఖర్మ కాదు. నా అదృష్టం. ఇప్పటికీ తీరుబడిగా వున్నప్పుడు ఆమె వొళ్లో తలెట్టుకు పడుకుంటే, ఆ మాతృమూర్తి నా తల మీద చెయ్యేసి నిమురుతుంటే ఆనందంతో తన్మయత్వం కలుగుతుంది. ఆ అనుభూతే వేరు. నువ్వు నా వొళ్లో తలెట్టుకు పడుకున్నా, నేను నీ వొళ్లో తలెట్టుకు పడుకున్నా చెలరేగే ఆనందానికి ఆధారం- శృంగారం, మోహం, కామం."

"......."

"నీమాటే నేనూ అంటున్నాను. నువ్వు నూరు చెప్పు వెయ్యి చెప్పు. మా అమ్మ మనింట్లోనే జీవితాంతం వుంటుంది."

"......."

నువ్వు వేరే యింట్లో వుంటావో, వేరే దేశం పోతావో నీ యిష్టం. నా నిర్ణయం మారదు"

"......."

"బెదిరిస్తున్నావా! అంత తెగ తెంపులు చేసుగోదల్చుకుంటే ఈ యింట్లోంచి బయటకెళ్లేది నువ్వో నేనో చట్టమే నిర్ణయిస్తుంది. ఏరు దాటింతర్వాత తెప్ప తగలేసే నీలాంటి సంస్కారహీనుడితో జీవితాంతం కాపరం చెయ్యగల సహనం నాకు లేదు. నేను అన్నింటికీ సిద్ధంగా వున్నాను. మనసు, మమత, మానవత్వం వున్న మనిషిని నేను, మృగాన్ని కాను. తెల్లవారింది, వెలుగొచ్చింది. మా అమ్మా తిరిగొచ్చేవేళయింది. ఫోన్ పెట్టేస్తున్నాను.

★ ★ ★

కాలింగ్ బెల్ మోగితే తలుపుతీసింది శ్యామల. పనిమనిషి లోపలికొచ్చింది. తల్లి యింకా గుడి నుంచి తిరిగి రాలేదేమిటి చెప్మా అని తొంగిచూస్తే బయట కిటికీ కింద తెగిపోయిన చెప్పుల జత, ఖాళీ సంచీ కనపడ్డాయి.

** రచన, అక్టోబరు 1998*